## ద్వారపురెడ్డికి మాతృ వియోగం

ప్రజాశక్తి - పార్వతీపురం

టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కర్షక మహర్షి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు తల్లి ద్వారపురెడ్డి సావిత్రమ్మ మంగళవారం ఉదయం 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. అనంతరం ఆమె మృతదేహాన్ని వారి సొంత గ్రామం గరుగుబిల్లి మండలం కొత్తూరుకు తరలిం చారు. ఆమె మతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారపురెడ్డి నివాసానికి వెళ్లి సావిత్రమ్మకి నివాళులర్పించారు.

# ప్రజాస్వామ్యానికి నిఘంటువు లెనిన్

## సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశంలో ప్రజాస్వామ్యం అంగట్లో సరుకులా మారుతుందని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. కామ్రేడ్ విఐ లెనిన్ శతజయంతోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సుకు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ లెనిన్ 54 ఏళ్ల జీవితకాలంలో చేసిన కృషి ప్రపంచ పీడితుల విముక్తి మార్గానికి నిత్య సూర్యోదయంగా కష్టజీవుల ఉద్యమాలకు ఉచ్వాస నిచ్వాసాలుగా వెలుగొందుతున్నారని తెలిపారు. విప్లవ విజయానికి ఎదురైన ప్రతి క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప అన్వేషి కామ్రేడ్ లెనినని అన్నారు. మానవాళి సకల కష్టాలకు కన్నీళ్లకు మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకవైపు పోరాడుతూనే మరోవైపు విప్లవ పార్టీ నిర్మాణం కోసం అంతర్గత విరోధులతో ఏకకాలంలో పోరాడి విజయం సాధించిన నిజమైన సవ్యసాచని అన్నారు. మార్క్సిజాన్ని అవపోసనం చేసి లెనినిజాన్ని జోడించి కార్మిక విముక్తి కోసం చాటి చెప్పిన మహా విప్లవ నేత సిద్ధాంతాలను నేడు మతోన్మాద రాజకీయ నేతలు అవహేళన చేస్తూ కార్పొరేట్ పెట్టుబడులకు దాసోహం చేసేందుకు అనేక చట్టాలను సవరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించేలా కార్మిక, రైతు, ప్రజల చట్టాలను చట్టసభల్లో చర్చించకుండానే మంద బలంతో అమలుకు ప్రయత్నం చేపడుతుందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ అప్రజాస్వామిక విధానాలకు లోబడి నేడు న్యాయస్థానాలు, ఎన్నికల వేదికలు రాజ్యాంగ విలువలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యం కోసం ప్రశ్నించే దేశ పౌరులను, మేధావులను దేశద్రోహులుగా చిత్రీకరించి మతోన్మాద ఎజెండాను శరవేగంగా ముందుకు తీసుకుపోతుందని, దేశంలో పెట్టుబడుదారుల, భూస్వాముల నిర్ణయాలు ఆధారంగానే దేశ రాజకీయాలు చలామణి అవుతుందని దీన్ని తీవ్రంగా ఖండించాలని కోరారు. ప్రజాస్వామ్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల కార్పొరేట్ విధానాలను ప్రభావితం చేసే నిర్ణయాలు చేపడుతున్నారని, ప్రజల పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, ఎన్‌వై నాయుడు, కె.రామస్వామి, జిల్లా నాయకులు డి.రమణారావు, గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, మర్రి శ్రీను, కోరాడ ఈశ్వరరావు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, సీతారాం, పాకల సన్యాసిరావు, ఎస్ ఉమా, బంకూరు సూరిబాబు, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి

## పాఠశాలను పరిశీలించిన తనిఖీ బృందం

రికార్డులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాల, కళాశాలలను మంగళవారం సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. గుంటూరు నుంచి వచ్చిన ఎస్ఎస్ఎఎటి సభ్యులు డిఆర్పీ ఎస్.నారాయణమూర్తి, బి.శివ పాఠశాలలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ అంజలీదేవి సమక్షంలో పాఠశాల రికార్డులు, మధ్యాహ్నం భోజనం నిర్వహణకు సంబంధించిన రికార్డులు, పాఠశాలలో బాలురు, బాలికల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను తనిఖీ చేశారు. పాఠశాల క్రీడా మైదానం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# అతిసారతో అప్రమత్తం

## జాగ్రత్తలు పాటించండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గత వారం రోజులుగా ప్రబలుతున్న అతిసారతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. వరుసగా అతిసార వ్యాధి లక్షణాలు గల కేసులు నమోదవుతున్నట్లు తెలుసుకొని వచ్చిన ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ సునీల్‌తో మాట్లాడారు. కేసులను తీవ్రత అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతిసార అదుపులో ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కేసులు అదుపులో ఉన్నప్పటికీ ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోజువారీ ఇంటింటి సర్వే, వైద్య శిబిరాలు నిర్వహణ, ప్రజలకు అవగాహన పెంచాలని, తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని రావాడ రామభద్రపురం డాక్టర్ శంకర్రావును ఆదేశించారు. గాంధీనగర్‌లో ఉన్న డ్రైన్లు పరిశీలించి అక్కడ వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వినోద్, ఎపిడమిక్ సెల్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో పరిస్థితిని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

**ఎంపిడిఒ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు**

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిదేనని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం మేజర్ పంచాయితీ కురుపాంలో గల గాంధీనగర్ వీధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను అలాగే పలు వీధుల్లో పైపులైన్లు లీకులను పరిశీలించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి తక్షణమే గ్రామంలో ఉన్నటువంటి పైప్‌లైన్లు లీకులన్నీ త్వరగా మరమ్మతులు చేపట్టాలని, పంచాయతీలో అన్ని వీధుల్లోనూ పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకొని ప్రజలెవరు వ్యాధుల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం గాంధీనగర్ వీధిలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. వీధికి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు దగ్గరలో ఎవరైనా చెత్త వేస్తే అటువంటి వారికి పెనాల్టీ వేయడం జరుగుతుందని మన ఇల్లుతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

### అతిసార నివారణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

**పార్వతీపురం** : కురుపాంలో విజృంభిస్తున్న అతిసార ప్రబలకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. అతిసార నివారణ చర్యలపై వైద్యులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇప్పటి వరకు కురుపాం సిహెచ్‌సిలో అతిసారంతో 25 మంది వైద్యం పొందారన్నారు. వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రితో పాటు పదుల సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులను కూడా ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దీన్ని నివారించేందుకు డిఎంహెచ్ఐ, డిసిహెచ్ఎస్, డిపిఒ, ఆర్‌డబ్ల్యుఎస్, సంబంధిత అధికారులు సంయుక్తంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా కురుపాం మేజర్ పంచాయతీలో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అలాగే ఎప్పటికప్పుడు గ్రామంలో నీటి పరీక్షలు జరిపి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేలా చూడాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. ఇకపై ఏ ఒక్కరూ అతిసారం బారిన పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని, అతిసారంతో బాధపడే వారికి తగిన వైద్యం అందించాలని వైద్యాధికారులకు తెలిపారు. పంచాయతీలోని వాటర్ ట్యాంకులను సకాలంలో పరిశుభ్రం చేయాలని, తదుపరి పరిశుభ్రం చేయాల్సిన తేదీలను ట్యాంకులపై రాయాలని అన్నారు.

## ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : పీడీ

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం సీతానగరం వచ్చిన ఆయన మాట్లాడుతూ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం నుంచి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రధానంగా రైతులకు ఉపయోగపడే నడిగట్టుల పనులు, చెరువు పనులు, పంట కాలవ పనులు చేయనున్నట్టు తెలిపారు. అలాగే ప్రతి జాబ్ కార్డుదారుడు పనికి వెళ్లేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పి.భాను తదితరులు పాల్గొన్నారు.

## పిఎం సూర్యఘర్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతానగరం

విద్యుత్ వినియోగదారుల నుంచి పిఎం సూర్యఘర్ పథకానికి వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు విద్యుత్ శాఖ ఎడి సిహెచ్ వి.రమణారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రతి వినియోగదారునికి ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తామన్నారు. ఈ సోలార్ పథకానికి 100 యూనిట్లు దాటిన ప్రతి ఇంటి వినియోగదారుడ్ని గుర్తిస్తామని తెలిపారు. 1 నుంచి 3 కిలో మెగా యూనిట్లకు రూ.78వేలు సబ్సిడీ కింద ఇవ్వనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా వినియోగదారునికి రుణం రూపం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎఇ ఎ.జగన్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముందే వచ్చిన జాతర

## వేలాదిగా తరలివచ్చిన యాత్రికులు
## నాసిరకంగా మెట్లు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతర వారం ముందే వచ్చినట్లుగా మంగళవారం భక్తులు దర్శించుకున్న తీరు కనిపిస్తుంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికుల దర్శనంతో వనం, చదురు గుడులు కిటకిటలాడాయి. సంక్రాంతి తర్వాత వారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి రావడానికి మరో కారణం కూడా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఊరు వచ్చినవారు, అలాగే చుట్టరకానికి వచ్చిన వారు మళ్లీ జాతరకు రాలేమనే ఉద్దేశంతో ముందుగానే అమ్మవారికి మొక్కులు సమర్పించుకునేందుకు వచ్చారు. గతంలో ఎప్పుడూ ఈ మాదిరిగా జాతరకు ముందుగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకోవడం చూడలేదని గ్రామస్తులు అంటున్నారు.

**నాసిరకంగా మెట్లు నిర్మాణం**

చదురుగుడి క్యూ లైన్ల నుంచి గుడి రహదారికి వెళ్లే మధ్యభాగంలో నిర్మిస్తున్న మెట్ల పనుల్లో నాణ్యత లోపిస్తుందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్, ఇటుకలు, వెటమిక్స్ వేసిన నిర్మిస్తున్నప్పటికీ ఇసుక శాతం ఎక్కువగా ఉన్నట్లు బయటకు కనిపిస్తోంది. దీంతో ఇదేమి నాణ్యత అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్, సూపర్వైజర్‌ను విలేకరులు ప్రశ్నించగా సోమవారం రాత్రి మెట్లపై నీరు ఎక్కువ శాతం పడిందని, దీంతో ఇసుక తేలిందని తెలిపారు. దాన్ని ప్లాస్టింగులో పూర్తి చేస్తామని చెప్పారు.

**సిరిమాను తిరిగేందుకు ఇబ్బంది తప్పదా?**

ఈనెల 27,28,29 తేదీల్లో జరగనున్న జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తిరువీధి అంకానికి ఇబ్బందులు తప్పేటట్లు లేవని గ్రామస్తులు, యాత్రికులు అంటున్నారు. నడుమ వీధిలోని రహదారికి అడ్డంగా కాలువపై వేసిన సిమెంటు దిమ్మలు ఆనుకొని సుమారు పది అడుగుల రహదారి నిర్మాణం వదిలేయడంతో సిరిమాను తిరిగినందుకు అవస్థలు తప్పేటట్లు లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతర సమీపిస్తున్నా ఇంకా రహదారి నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు నడిమివీధి రహదారిలో ల్యాబ్ కల్వర్టు ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండేది కాదని, సిమెంటు పలకలు కాలువపై వేయడం వల్ల అదే రహదారి నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మిస్తేనే సిరిమాను తిరిగేందుకు ఆస్కారం ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**వనం గుడి వద్ద పొంచి ఉన్న ప్రమాదం**

పోలమాంబ అమ్మవారి వనం గుడి వెనుక భాగంలో ఉన్న వేప చెట్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని యాత్రికులు ఆందోళన చెందుతున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వెంటనే భక్తులంతా వేప చెట్టును పూజించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే వేప చెట్టు కొమ్మ భాగం మొదటి భాగం నుంచి పగుళ్లు తేరి ఉండడంతో ఏ క్షణంలోనైనా చెట్టు కొమ్మ విరిగిపడేందుకు ఆస్కారం ఉంది. దీనిపై అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని యాత్రికులు కోరుతున్నారు.

అమ్మవారిని దర్శించుకొనేందుకు పోటెత్తిన యాత్రికులు

నడుమవీధిలో అసంపూర్తిగా విడిచిపెట్టిన రోడ్డు పనులు

చదురుగుడి వద్ద నాసిరకంగా నిర్మించిన మెట్లు

## నేటి నుంచి పింఛన్ల పై విచారణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో మొదటి విడతగా వికలాంగ పింఛన్లపై బుధవారం నుంచి వచ్చే మార్చి 24 వరకు విచారణ చేపట్టనున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు, 197 దృష్టి లోపం, 683 అంగవైకల్య పింఛన్లపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె తెలిపారు. సాలూరు ఏరియా ఆసుపత్రి, పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రుల అధికారుల సమక్షంలో పెన్షన్ల విచారణ జరగనుందని, కావున పింఛనుదారులంతా విధిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

## డోలీ మోతలు లేని గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి-మెంటాడ

డోలీల మోతలు లేని గిరిజన గ్రామాలే ప్రభుత్వం లక్ష్యమని, ఇందుకోసం గిరి శిఖర గ్రామాలకు రహదారులు వేస్తున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పెదమేడపల్లి గ్రామంలో పల్లె పండగ సందర్భంగా గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో రూ.80కోట్లతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వంద రోజుల్లో 102 పనులు పూర్తిచేశామన్నారు. మొదట విడత పనులు పూర్తయితే,రెండవ విడత పనులకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి నదులు అనుసంధానం జరిగితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగాలు నియామకాలు జరుగుతున్నాయని, హెల్త్, ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

# జోరుగా గుట్కా అమ్మకాలు

- హోల్ సేల్ వ్యాపారుల హవా
- పట్టని అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గుట్కా, ఖైనీ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ప్రతి పాన్‌షాపుతో పాటు కిరాణా దుకాణాల్లోనూ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఖైనీ, గుట్కా ప్యాకెట్లను వ్యాపారులు మూడు రెట్లుఅధికంగా అధికంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్కాల నిషేధం అమల్లో ఉన్నప్పటికీ అవేవీ పట్టినట్లుగానే విచ్చలవిడిగానే వ్యాపారం జరుగుతుంది. ప్రతి పాన్‌షాపులో గుట్కాలు విక్రయిస్తున్నారు. ఇవి హానికరమని తెలిసినా కొంతమంది బానిసలే అధిక రేట్లకే అమ్మకాలు చేపడుతున్నారు. పాలకొండలోనే కేంద్రం గా రిటైల్ వ్యాపారులకు అందిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారు. ఇక్కడ ఇద్దరు వ్యాపారులు ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తు న్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్లాకిమిడి, రాయగడ నుంచి ఇక్కడికి అక్రమ రవాణా అవుతున్నట్లు తెలుస్తుంది. పాలకొండలో హోల్‌సేల్ గోడౌన్‌లో భారీ స్థాయిలో నిల్వలో ఉంచుతున్నట్లు తెలుస్తుంది. గతంలో ఉన్న పోలీసు అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. గుట్కా వ్యాపారం ఇంత భారీ స్థాయిలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

2027నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర అదనపు సంచాలకులు (డిసిపి) డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరి సూచించారు. ఇందుకు సంబంధించి శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులకు స్థానిక ఎన్‌జిఒ సమావేశ భవనంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్‌సివిబిడిసికి సంబంధించి పిహెచ్‌సి వైద్యాధికారి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు నిర్వర్తించాల్సిన విధులను వివరించి విధిగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి రెండు వారాలకు క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వేలెన్స్ పక్కాగా చేపట్టి, మలేరియా లక్షణాలున్న వారిని గుర్తించాలన్నారు. యాక్టివ్ సర్వేలెన్స్‌లో గుర్తించిన వారికి వెంటనే రక్తపూతలు సేకరించి సకాలంలో మైక్రోస్కోపీ పరీక్షలు జరిపి నిర్ధారణ అయిన తర్వాత చికిత్స అంద జేయాలని అన్నారు. నేషనల్ డ్రగ్ పాలసీ కచ్చితంగా అవలంభిం చాలని, చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షణ తప్పనిసరి అని ఆదేశిం చారు. రాబోయే సీజన్ ఎదుర్కోడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో సర్వేలెన్స్ ఉధృతం చేసి లార్వా ప్రదేశాలను నిర్మూలించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా శాఖల సమన్వయంతో ముందుగానే కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. దోమల నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు డ్రైడే-ఫ్రైడే, ఎఎల్ఒ ఆపరేషన్, ఐఆర్ఎస్, ఐఎస్ఎస్ స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి మలేరియా, డెంగ్యూ నియంత్రణకు కషి చేయాలని తెలిపారు. ఫైలేరియా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు వైద్యాధికారులు, సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ జిల్లాలో మలేరియా నియంత్రణకు అందరూ సమిష్టి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, డిప్యూటీ డిఎంహెచ్ఒలు డాక్టర్ కె.విజయపార్వతి, డాక్టర్ కెవిఎస్ పద్మావతి, జోనల్ ఎడిలు (ఎంటమాలజీ) డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ కెవిఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వై.మణి, డిఐఒ డాక్టర్ ఎం.నారాయణ రావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్ మోహనరావు, డాక్టర్ పి.ఎల్.రఘు కుమార్, డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, స్టేట్ టీమ్ ఎం.పార్వతీశం, కె.శ్రీకాంత్, ఎఎంఒ బివి రమణ, కన్సల్టెంట్ రామచంద్ర పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి

ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాథరావు

## ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుకుపేటలో చేపడుతున్న ఉపాధి పనుల్లో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ఎంపిడిఒ పి.త్రినాథరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్తరు నమోదు వచ్చినవారి సంఖ్య పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పని చేస్తే వేతనం కట్టుబాటు అవుతుందన్నారు. అలాగే కోట సీతారాంపురంలో నిర్మాణాలు జరుగుతున్న మినీ గోకులాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

దేవానంద్ను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

## దేవానంద్కు తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం వాసి, ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పాలక దేవానంద్ తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని కౌత పూర్ణ నంద విలాస్ కళా వేదికలో శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, సభ్యులు బోయి హైమావతి, వరల్డ్ పోయెట్రీ ఆకాడమి, వరల్డ్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో దేవానంద్ను ఘనంగా సన్మానించారు. ఈ పురస్కారం రావడం పట్ల గ్రామ పెద్దలు, మిత్రులు, బంధువులు, ఆనందం వ్యక్తం చేశారు.

చలివేంద్రిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

## కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో మంగళవారం స్థానిక వైద్య సిబ్బంది కుష్టు వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, కనుబొమ్మలు, కనురెప్పలు వెంట్రుకలు రాలిపోవడం, కనుబొమ్మలు మూతపడకపోవడం, కనుప్పాపలు తేడా ఉండడం, ముక్కులో నుంచి రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అరచేతులు అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, తెలియకుండానే చేతులు, కాళ్లు బొబ్బలు రావడం, చేతి వేలు కాలి వేలు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, ఈ విధమైన ఉన్న లక్షణాలుంటే నిర్ధారణ చేయించుకోవాలని సిబ్బంది కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ.శాంతి కుమారి, ఎంఎల్హెచ్పిలు సునీత, లలిత, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

## నీలమణి దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

**గుమ్మలక్ష్మీపురం :** శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో గల నీలమణిదుర్గను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు. ఆమె వెంట మండల టిడిపి కన్వీనర్ పాటి సుదర్శనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, మండల కాపు సంఘం అధ్యక్షులు కొనిస మన్మధరావు, ఎస్ఎంసి చైర్మన్ సొండిన రాజేష్, నియోజకవర్గ టిడిపి మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, గుజ్జువాయి మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అవసరమైన పరికరాలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైతులకు అవసరమైన టార్పాన్లు, ట్రాక్టర్లు, నీటి ఇంజన్లు అవసరమైన రైతులను గుర్తించడమే కాకుండా వారికి అవసరమైన పరికరాలను తక్షణమే అందించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం మండలాలకు చెందిన సబ్సిడీ రూపంలో ఆయిల్ ఇంజన్లు 40 మందికి, టార్పాన్లు 1500 మందికి, ట్రాక్టర్లు 20 మందికి ఇప్పటికే లబ్ధిదారుల జాబితా తయారు చేశారని, అయితే నెలలు గడుస్తున్నా లబ్ధిదారులు ఎవరికీ పరికరాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. కావున అధికారులు స్పందించి ఇప్పటికైనా రైతులకు అవసరమైన పరికరాలు అందజేయాలని కోరారు.

## కురుపాంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివ్వాలవీధిలో రావాడ రామభద్రపురం పిహెచ్సి వైద్యాధికారి వీకెల శంకరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం మార్పుల వల్ల ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించి, వేడినీళ్లు తాగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాంటప్పుడు వ్యాధులు బారిన పడకుండా కొంత మేరకు ఉండొచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శంకరరావు

# జీడికి మద్దతు ధర కల్పించేనా?

### ఎస్ హెచ్జి, విడివికెల ద్వారా కొనుగోలు
### జిసిసికి, టిటిడికి జీడిపప్పు విక్రయం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గిరిజనులు ఆరుగాలం శ్రమించే సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో జీడి ఒకటని చెప్పొచ్చు. ఇది గిరిజనులకు ఎంతో ఆర్థికంగా చేయూతనిచ్చేది. ఎటువంటి రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి సిద్ధంగా పండించిన పంటల్లో జీడి పంట ఒకటి. ఏజెన్సీలో ఈ జీడిపంట అధికంగా కాపుకు వస్తుంది. దీనికి మార్కెట్ ధర కల్పించి, గిరిజనులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక్క అడుగు ముందుకు వేశారు. ఇంతవరకు జీడి పంటపై ఏ అధికారి దృష్టి పెట్టలేదు. పిఒ యశ్వంత్ కుమార్రెడ్డి గిరిజనులకు ఆర్థిక స్వావలంబన ఇవ్వాలన్న ధృడ సంకల్పంతో జీడికి మార్కెట్ ధర కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఏజెన్సీలో అధిక జీడిపంట కాపు వస్తుందన్న ఉద్దేశంతో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి విడివికెల ద్వారా కొనుగోలు చేసి ఆ పప్పును జిసిసి ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానానికి విక్రయిస్తే గిరిజనులకు కొంత ఆర్థిక చేయూత ఉంటుందని ఉద్దేశంతో దీనిపై నడుం బిగించారు. సీతంపేట ఏజెన్సీలో 17, 839 ఎకరాల్లో ఉద్యానవన శాఖ ద్వారా జీడి సాగు సాగుతుంది. వీటిపై 7,234 మంది రైతులు ఆధారపడి ఉన్నారు. 3,567 మెట్రిక్ టన్నుల పంట వస్తుంది. దీన్ని ఇప్పటి వరకూ వ్యాపారులు, దళారులు కారు చౌకగా కొనుగోలు చేసుకుని లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పుడు వీరి మోసానికి చెక్ పెట్టి మహిళా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉద్యాన శాఖ, వెలుగు సమన్వయంతో జీడికి మార్కెట్ ధర కల్పించాలని ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. వెలుగు ఎస్ఎస్జి గ్రూపులు, విడివికె కేంద్రాల ద్వారా అప్పటికున్న మార్కెట్ ధరను బట్టి గిరిజన రైతుల వద్ద కొనుగోలు చేసి, జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసి టిటిడి, జిసిసికి విక్రయించాలని ఇప్పటికే సిద్ధమయ్యారు. ఇందుకు తగ్గట్టుగా 1800 మంది మహిళా రైతులను గుర్తించారు. ఈ రైతులకు గోయిది గ్రామంలో వెలుగు హార్టికల్చర్ స్వయల్ సైంటిస్ట్తో శిక్షణ ఇచ్చారు. మార్చి, ఏప్రిల్లో జీడి పంట కాపునకు వచ్చేసరికి దానికి తగ్గట్టుగా అధికారులు సిద్ధమవుతున్నారు.

జీడి రైతులకు టిటిడికి విక్రయించడానికి 7234 మంది రైతులకు సేంద్రియ ఆర్గానిక్ ఆంధ్రప్రదేశ్ కమినేట్ మేనేజడ్ నేషనల్ ఫాన్ (ఎపిసిఎస్ఎఫ్), ఎస్ఎస్సి గ్రూపులు ద్వారా ఆర్గానిక్ సర్టిఫికెట్లు కూడా అందజేసినట్లు తెలుస్తుంది. అయితే ప్రస్తుతం 360 టన్నులు జీడి పిక్కలు రోజుకు ప్రాసెసింగ్ చేయాల్సి ఉంది. దీనికి తగ్గట్టుగా ఇప్పటికే పంటతో పాటు ప్రాసెసింగ్ యూనిట్లు రైతులకు శిక్షణలో అవగాహన ఐటిడిఎ ఉద్యాన శాఖ అధికారి ఎస్వి వెంకటగణేష్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడుతున్నారు. జీడిపై రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అధిక దిగుబడి కోసం ఏపుగా పెరగడానికి కొమ్మ కటింగు వంటివి చర్యలు చేపడుతున్నారు.

#### మార్కెట్ ధరకు జీడిపిక్కలు కొనుగోలు

ఎస్హెచ్జి, వికాస్ కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి మార్కెటింగ్ ధర కల్పిస్తాం. ఎస్హెచ్జి, విడివికె ద్వారా జిసిసి, టిటిడికి విక్రయిస్తాం. తద్వారా రైతులకు మార్కెట్ ధరతో పాటు ఆర్థిక స్వాలం బన ఉంటుంది.

**ఎస్ వెంకట గణేష్ , హార్టికల్చర్ అధికారి, సీతంపేట**

# పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పాలకొండ

పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సువ్వాల మన్మధరావు అన్నారు. మండలంలో బెజ్జి, తపంటాపల్లిలో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జరపడం ద్వారా మేలు చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా రెండు శిబిరాల్లో పశువులకు పరీక్షలు జరిపి వైద్యం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి పి.మాణిక్యారావు. బెజ్జ సర్పంచ్ సువ్వాల శ్రీనివాసరావు, వైద్యులు బి.సిద్ధార్థ ఉన్నారు.

జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మన్మధరావు

**సీతానగరం :** మండలంలోని గుచ్చిమి, తాన సీతారాంపురం, జోగింపేట, బళ్ల కృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం పశువు ల వైద్య శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దేవకుమార్ మాట్లాడుతూ పాడి పశువుల రైతులు గ్రామాల్లో జరిగే పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు టీకాలు వేయబడతాయన్నారు. అలాగే గర్భధారణకు సంబంధించి వ్యాధులకు తనిఖీలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటికే 490 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, పశు వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు బి.చిరంజీవులు, ఎం.సంజీవరావుతో పాటు రైతులు పాల్గొన్నారు.

**కొమరాడ :** ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విక్రమపురం ఎంపిటిసి సభ్యులు, టిడిపి అరకు పార్లమెంటరీ రైతు సంఘం అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. విక్రాంపురం, పరుశు రాంపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ ఎడి శ్రీనివాసరావు పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సత్యనారాయణ, డిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మల్లిబాబు, ఉప సర్పంచ్ రామకష్ణ, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

**గరుగుబిల్లి :** మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని ఉద్దవోలులో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సురేష్ కుమార్ పశువులకు తనిఖీలు నిర్వహించారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, కావున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**భామిని :** క్షేత్ర స్థాయిలో పశు వైద్య శిబిరాల ద్వారా పశువులకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని భామిని ఇన్ఛార్జి వెటర్నరీ అసిస్టెంట్ మడక సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దదిమిలిలో మంగళవారం పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా పశువులకు వాక్సినేషన్లు, గర్భ కోశ వ్యాధులు నివారణకు సంబంధించిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలు ఈనెల 31 వరకు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పాడి పశువులు సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విహెచ్ఎలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## ప్యాకేజీతో స్టీల్ప్లాంట్కు మేలు

### టిడిపి నాయకులు భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు ప్యాకేజీని మంజూరు చేయడం పట్ల పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి పడాల భూదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం ఒక ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదని, ఇది విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల విజయం, రాష్ట్ర ప్రజల గర్వం, పట్టుదల, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల అచంచలమైన పోరాట స్ఫూర్తికి ఆమె ప్రశంసలు తెలిపారు. అలాగే పిఎం, సిఎం, డిప్యూటీ సిఎం, కేంద్రమంతులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వైజాగ్ స్టీల్ప్లాంట్, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సమస్యలను పార్లమెంట్లో సంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు లేవనెత్తినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం ఒక వారం వ్యవధిలో, సౌత్ కోస్ట్ రైల్వే జోన్కు శంకుస్థాపన, వైజాగ్ స్టీల్ప్లాంట్ పునరుద్ధరణ వంటి రెండు ప్రధాన విజయాలను కూటమి ప్రభుత్వం సాధించిందని తెలిపారు. ఆ ఐకమత్యం, సంకల్పంతో పోరాడిన ఈ విజయం ప్రతి తెలుగు వారికి సంక్రాంతి కానుకగా నిలుస్తుందని ఆమె తెలిపారు.

## డిడిని కలిసిన గిరిజన నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణిని ట్రైబల్ రైట్స్ ఫోరం రోబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకష్ణ, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, ఆదివాసీ జెఎసి నాయకులు దుక్క సీతారాం, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్ర శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.

## సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నేరాల నియంత్రణకు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అవసరమైన చోట సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.రమేష్నాయుడు తెలిపారు. గరుగుబిల్లి హనుమాన్ టెంపుల్ జంక్షన్ వద్ద మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళ వారం సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని పలు ప్రధాన రహదారుల జంక్షన్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగా హన కల్పిస్తున్నామన్నారు.

## పెద బుడ్డిడికి బస్సు నడపాలి

**పార్వతీపురం టౌన్ :** పార్వతీపురం నుంచి జియమ్మవలస మండలం పెదబుడ్డిడికి ఆర్టిసి బస్సు నడపాల్సిందేనని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రంజిత్ కుమార్ మంగళవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్తులు బస్సు నడపాలని కోరుతూ అర్జీ పెట్టగా అధికారులు సరిపడినన్ని బస్సుల్లేవని, ఆదాయం లేదని కారణాలు చెప్పడం సరైంది కాదని, ఆ సమస్యలు ప్రభుత్వం, అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉన్న బస్సులు సర్దుబాటు చేసి, కొత్త బస్సుల కోసం ప్రభుత్వానికి నివేదించాలని రంజిత్ కుమార్ కోరారు.

# వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో వేదాంత జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు, నెహ్రు యువ కేంద్ర వాలంటీర్ల అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, వాహనం వెనుక కూర్చొన్న వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేని పక్షంలో జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ విధివిధానాలు, హెల్మెట్ ధరించకపోతే కలిగే నష్టాలపై అవగాహనా కల్పించారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇస్తున్నారని, వారు కనీసం హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాన్ని స్పీడ్గా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలను తెలిపారు. వాహనాలపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే భారీగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వాహనం నడపరాదని, స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లు అధికంగా పిల్లలను వాహనంలో ఎక్కించరాదని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించి క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో రోడ్ సేఫ్టీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ ప్రజా రవాణాధికారి జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, ఎ.వరప్రసాద్, బి.కాశీరామ్ నాయక్, రవాణా శాఖ సిబ్బంది, వేదాంత వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిటిఒ దుర్గాప్రసాద్రెడ్డి

గుమ్మలక్ష్మీపురం : రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ నిర్మలాజ్యోతి

## గిరిజన మత్స్యకారుల ఆర్థిక భరోసా ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన మత్స్యకారులకు ఆర్థికంగా భరోసాను కల్పించడమే ప్రభుత్వ లక్ష్మని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య అన్నారు. మండలంలోని కస్పగదబవలస చెరువు వద్ద కూటమి నాయకులతో కలిసి ఫిరాంగ్ చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు - గిరిజన ఉప ప్రణాళిక పథకంలో 100శాతం సబ్సిడీతో మండలంలో కస్పగదబవలస, గుంజరాడ, చప్పగొత్తిలి, కాకితాడ, బియ్యాల వలస, ఉదయపురం గ్రామాల్లో 16 మంది గిరిజన మత్స్యకార రైతులకు 25వేల చేప పిల్లలను ఇచ్చి విడుదల చేశామని తెలిపారు. దీని ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందని, కావున ఈ అవకాశాన్ని గిరిజన మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల కన్వీనర్లు కెవి కొండయ్య, ఎన్.వంశి, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి జి.రమణమూర్తి, జనసేన నాయకులు బొమ్మి మురళి, గ్రామ మత్స్య సహాయకులు కె. ఇంద్రజ, ఎన్. సురేష్ పాల్గొన్నారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డిశంకర్రావు ప్రజలను కోరారు. మహాసభల సందర్భంగా సిపిఎం విశిష్టత గురించి వాడవాడలా ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం రామకృష్ణ నగర్లో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పట్టణ ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో 2005 రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేసి ఇళ్లు సాధించుకున్నామని తెలిపారు. ఆస్తిపన్ను, చెత్త పన్ను, రద్దు చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర వ్యాపితంగా పోరాడిన చరిత్ర కలిగిన పార్టీ అని, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మహిళలు చేస్తున్న పోరాటాలకు అన్ని రకాల మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.శాతమూర్తి, ఎం.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

# చినభోగిలిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటను పరిశీలించి మెలుకువలు తెలిపారు. ఈ పంట సాగుకు సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు అనుకూలమైనవన్నారు. నీరు నిల్వ ఉండే భూములు పనికిరావన్నారు. విత్తన మోతాదు 8 కేజీలు ఎకరానికి వేసుకోవాలని, కిలో విత్తనాలకు 3 గ్రాముల మంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్తో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేతదశలో మొక్కలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. విత్తే సమయంలో 1/3 వంతు నత్రజని, భాస్వరం, 1/2 వంతు పొటాష్ వేసుకోవాలని, మొక్కల్లో జింకు లోపం (ఆకుల మధ్య భాగం పసుపుపచ్చ రంగులోకి మారడం, లేత పైరు తెల్ల మొగ్గగా మారడం) కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ను కలిపి పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఈ పంటలకు సోకే వివిధ రకాల తెగుళ్ల నివారణకు పలు సూచనలు రైతులకు తెలిపారు. ఆదే విధంగా అపరాలు పంట కోత దశలో ఉందన్నారు. రైతులకు అడిగి దిగుబడి వివరాలు తెలుసుకున్నారు. ఎకరాకు సాధారణ రకాలు 2 క్వింటాల్ వరకు దిగుబడి వస్తుందని తెలిపారు.

**గుమ్మలక్ష్మీపురం :** మండలంలోని లంబేసులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఎడిఎ నిర్మలాజ్యోతి మాట్లాడుతూ రైతులు రబీ సీజన్లో పండించాల్సిన పంటలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పిఎం కిసాన్లో రైతుల నమోదు, జీడి పంటపై దోమల నివారణ చర్యలు, తదితర అంశాలను రైతులకు వివరించారు. రాగి పండించే రైతులకు సబ్సిడీ పంపిణీపై పిండి మిల్లులు అందజేయనున్నట్లు వివరించారు. ఖరీఫ్ సీజన్కు రావాల్సిన వ్యవసాయ పరికరాలపై రైతుల నుంచి ఇండెట్లు కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ ప్రసాదరావు, తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ నిర్మలాజ్యోతి

సీతానగరం : మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

#### వరి నాట్లలో మెలకువలు పాటించాలి

**పాచిపెంట:** వరి నాట్లు వేసేటప్పుడు చిన్నచిన్న మెలకువలు పాటించడం ద్వారా కనీసం రెండు క్వింటాళ్ల అదనపు దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కోస్టువలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ దమ్ము చేసిన వారంరోజుల తర్వాత మళ్లీ పంట దమ్ము చేయడం ద్వారా కలుపు నివారించుకోవచ్చని, అలాగే నాటేటప్పుడు బురదపదును మాత్రమే ఉంచి 1,2 మొనలు పైపైన మాత్రమే నాటుకోవాలని, 20 రోజులు ఉండేలా చూసుకోవాలని ఈ మెలకువలు పాటించడం ద్వారా కనీసం 2 గంటల అదనపు దిగుబడి పొందవచ్చని తెలిపారు. అలాగే దమ్ములో తప్పనిసరిగా డిఎపితో పాటు పొటాష్ 15 కేజీలు, యూరియా 17 కేజీలు కలిపి వేసుకోవాలని సూచించారు. దమ్ములో పొటాష్ వెయ్యడం ద్వారా పంటకు చీడపీడలను తట్టుకునే గుణం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం నారుమడిలో ఎంటియు, 1010 రకానికి అగ్గి తెగులు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం కేసలిలో గులి పద్ధతిలో పండిస్తున్న చోడిపంటకు ద్రవ జీవామృతాన్ని నీటి ద్వారా పారించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీతంపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సంత మార్కెట్ సమీపంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు డ్రంక్అండ్ డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి వాహనదారుని నుంచి యంత్రం ద్వారా బ్రీతింగ్ పరీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కావున వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.